క్లుప్తంగా

రేషన్ షాపు ప్రారంభం



రేషన్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: తెల్ల రేషన్ కార్డు పొందిన ప్రతి ఒక్కరూ ప్రతినెల క్రమం తప్పకుండా రేషన్ సరుకులను తీసుకోవాలని అందిపుచ్చుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం హైదర్‌నగర్‌లో నూతనంగా మంజూరైన రేషన్ షాపును డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... ప్రభుత్వం అందజేస్తున్న రూపాయికి కిలో బియ్యాన్ని, ఇతర వస్తువులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నక్క శ్రీనివాస్, పోతుల రాజేందర్, వెంకటేష్‌యాదవ్, కుమారస్వామి, సత్యనారాయణ, సత్తార్ తదితరుల ఉన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి శాంతినగర్‌లోని చింతపట్ల వెంకయ్య పార్కులో సంకల్ప ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోగ్యవంతమైన జీవితం గడుపుతూ.. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. మంచి పౌష్టికాహారం సరైన వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ అందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించినందుకు సభ్యులందరిని అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, రఘుకుమార్, నవీన్‌కుమార్, రమేష్ బాబు, ఈశ్వర్, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మసీద్-ఏ-ఫాతిమాలో ఇఫ్తార్



కూకట్‌పల్లి: భరత్‌నగర్ కాలనీలోని మసీద్-ఏ-ఫాతిమాలో హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మహమ్మద్ మక్బూల్ ఆదివారం ఇఫ్తార్, సెహర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం 30 రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు. ఈ అల్పాహారం కార్యక్రమంలో సుమారు 700వందల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు షేక్ మహ్మద్ ఖలీల్, కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లలో సహకరించారు.

ఘనంగా ఉస్మానియా డెంటల్ కాలేజీ స్నాతకోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా డెంటల్ కాలేజీ-2017 బీడీఎస్ బ్యాచ్ స్నాతకోత్సవం ఆదివారం సందడిగా జరిగింది. హైదరాబాద్ గుడిమల్కాపూర్ కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 71 మంది డెంటల్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వ్యక్తిగత ఆరోగ్యానికి నోరే దర్పణం అయినా, మన దేశంలో ఇంకా డెంటల్ కేర్‌పై అవగాహన తక్కువగానే ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ విషయంలో మరింత అప్రమత్తత పెరిగే కొద్దీ డెంటిస్ట్‌లకు అవకాశాలు పెరుగుతాయని ఆయన వివరించారు.

ధనార్జనే ధ్యేయం.. పార్కింగ్‌కు చూపరు మార్గం

- ఇష్టానుసారంగా అంతర్గత రహదారులపై పార్కింగ్
- పార్కింగ్ వసతి చూపని హాస్టళ్ల నిర్వాహకులు
- చేసేది లేక రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్న వైనం
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



అడ్డగుట్ల సొసైటీలో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిలిపివేసిన ద్విచక్ర వాహనాలు



కార్ల పార్కింగ్‌తో నిండిన కళామందిర్

భాగ్యనగర్‌కాలనీ: అంతా మా ఇష్టం... ఎక్కడైనా పార్కింగ్ చేస్తాం... మమ్మల్ని అడిగే వారు ఎవరు? అన్నట్లు ఉంది ఇక్కడ పార్కింగ్ తీరును చూస్తే. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏ కాలనీలో చూసినా మెయిన్ రోడ్లుతో పాటు అంతర్గత రహదారులు, కాలనీల్లో ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్‌తో నిండిపోయి కిక్కిరిసిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా గంటల కొద్దీ రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తూ వచ్చే పోయే వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అసలే ఇరుకైన రోడ్లు. దీనికి తోడు రోడ్లుకు ఇరువైపులా కార్లను, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయటంతో మరో వాహనం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎదురుగా వాహనం వచ్చిందంటే ట్రాఫిక్ సమస్య తప్పటం లేదు.

◆ హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ప్రధానంగా అడ్డగుట్ట సొసైటీలో ఇష్టానుసారంగా అనధికార భవనాల్లో వందలాది హాస్టళ్లు నెలకొల్పారు. వీటిలో పార్కింగ్ వసతి లేకపోవటంతో హాస్టల్స్‌లో ఉంటున్న వారు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. హాస్టల్ యాజమాన్యాలు హాస్టల్స్‌లో ఉన్న వారి వద్ద నుంచి వేలల్లో నగదు వసూలు చేస్తున్నప్పటికి వారికి పార్కింగ్ వసతి కల్పించకపోవటంతో రోడ్లకు ఇరువైపులా ద్విచక్ర వాహనాలు, కార్లను వదిలి వెళ్తున్నారు.

◆ దీంతో అటుగా వచ్చే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కటి రెండు రోజులు కాకుండా రోజూ పరిస్థితి ఇదే విధంగా కొనసాగుతున్నప్పటికి ట్రాఫిక్ పోలీసులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదు. బయట పార్కింగ్ చేయటంతో వాహనాల దొంగతనాలకు గురైతే పోలీసుల నిఘా వైఫల్యం అంటూ కేసులు నమోదు చేస్తున్నారు.

సెల్లార్లు లేకపోవటంతో సమస్య...

కొన్ని కాలనీల్లో సెల్లార్‌లు ఉన్నప్పటికి వాటిని యజమానులు అద్దెకు ఇచ్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆయా షాపులకు వచ్చే వాహనదారులు పార్కింగ్ సౌకర్యం లేకపోవటంతో రోడ్లపైనే పార్కింగ్ చేసి వెళుతున్నారు. బహుళ అంతస్తుల యజమానులు అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పార్కింగ్‌వసతి ఏర్పాటు చేయకుండా ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించటంతో ఆయా పనుల నిమిత్తం వచ్చిన వాహనదారులు పార్కింగ్ సౌకర్యం లేకుండా ఇబ్బందికి గురవుతున్నారు.

గతంలో చలాన్లు విధించినా...

◆ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ, అడ్డగుట్ట సొసైటీ, హెచ్ఎంటీ శాతవాహననగర్‌లతో పాటు మోర్ సూపర్‌మార్కెట్ రహదారిలో సైతం నిత్యం వాహనాల పార్కింగ్‌తో సతమతమవుతున్నారు. ట్రాఫిక్ సమస్యను అరికట్టడంలో భాగంగా ఇటీవల మోర్ సూపర్ మార్కెట్‌ను ఆనుకొని నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డును సైతం వదిలిపెట్టకుండా అడ్డదిడ్డంగా కార్లను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడటంతో స్పందించి డివిజన్ కార్పొరేటర్ ట్రాఫిక్ పోలీసులను పిలిపించి అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలకు చలానాలు విధించారు. అయినా మళ్లీ అలాగే పార్కింగ్ చేస్తున్నారు. రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా వాహనాలను పార్కింగ్ చేసిన వారి వాహనాలకు చలానా విధించటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలి..



హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ఒక కాలనీ నుంచి మరో కాలనీకి వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. కాలనీలోని హైటెన్షన్ రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు. మరో వైపు రోడ్లపైనే చిరువ్యాపారులు బండ్లను పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చలానాలు విధిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు.

– సత్యనారాయణ, ఆదిత్యానగ్ కాలనీ

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో తెలంగాణ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో 53వ ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమన్వయకర్త దాసరి రాజు అజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వివేక్‌చంద్ర, శశికాంత్‌రెడ్డి మేడ్చల్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ రెడ్డి, కళ్యాణ్‌కుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో..



కూకట్‌పల్లి: ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం కూకట్‌పల్లిలో రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పాల్గొని ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలపై ఎల్లప్పుడు పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ నాయకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గూడెపు నాగరాజు, సయ్యద్ మిస్బా, అరుణ్‌రెడ్డి, అజయ్, సాయిరితేష్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



దళిత సంఘం నేతలతో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి నియోజకవర్గానికి సంబంధించిన దళిత సంఘం సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా ఈనెల 14న ప్రారంభించబోతున్న అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దళితులను అన్ని విధాల ఆదుకుంటూ వారికి సమాజంలో మంచి గుర్తింపు తీసుకొచ్చే విధంగా నిర్ణయాలు తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి దళిత బంధు పథకం ద్వారా వారి ఉన్నతిలో ముఖ్యమంత్రి కేసీఆర్ భాగమవుతున్నారని ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దళిత సంఘం సభ్యులు మాట్లాడుతూ.. మునియోజకవర్గంలోని దళితులందరినీ ఆదుకుంటూ వారికి గౌరవం ఇస్తూ మెట్రో స్టేషన్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెట్రోస్టేషన్ అని నామకరణం చేయటం, బాలానగర్ ఫ్లై ఓవర్‌కు బాబు జగ్జీవన్‌రామ్ పేరు పెట్టడం ఇవన్నీ కేవలం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవ వల్లే అయ్యాయని అన్నారు. అందుకు ఆయనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం సభ్యులు కర్క పెంటయ్య, బొట్టు విష్ణు, రఘునందన్ బాబు, బోడ నర్సింగరావు, బండి సుధారాణి, నపారి చంద్రశేఖర్, నాగేష్, ప్రభాకర్, శశికళ, రత్నం, సల్మాన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా సంక్షేమ పథకాలు

బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్



ఆల్విన్‌కాలనీ: గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో అభివృద్ధి శూన్యం అన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందని ద్రాక్షలాగా మిగిలిపోయాయని తెలిపారు. ఏ బస్తీ చూసినా, ఏ వ్యక్తిని అడిగినా అన్నీ సమస్యలే కనిపిస్తున్నాయన్నారు. రేషన్‌కార్డులు, ఫించన్లు, రోడ్లు, వీధి లైట్లు, దోమలు, డ్రైనేజీ దుర్వాసన, పారిశుద్ధ్య లేకపోవటం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటిటికి అందకపోవటం వంటి అనేక సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. వీటి పరిష్కారానికి బీజేపీ నడుం బిగించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామరాజు, కుమార్‌యాదవ్, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, జీఎస్ రాజు, సందీప్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్, సుధాకర్, భరత్, అనిత, కవిత, మునిషా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఎమ్మెల్యేకు రెడ్డి కుటుంబాల సంపూర్ణ మద్దతు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కేపీహెచ్‌బీకాలనీకి చెందిన సుమారు 150 మంది రెడ్డి కుటుంబాల వారు ప్రకటించారు. ఆదివారం కాలనీలోని ఇండిస్ వన్‌సిటీకి చెందిన రెడ్డి కుటుంబీకుల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి హాజరైన సుమారు 150 కుటుంబాలు ఏకపక్షంగా మాధవరం కృష్ణారావుకు మద్దతు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఎవరికి ఎటువంటి అవసరం ఉన్నా మీకు నిత్యం అందుబాటులోనే ఉంటానన్నారు. నియోజకవర్గంలోని అందరం అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా కేపీహెచ్‌బీలోని అనేక పార్కులు ఓపెన్ జిమ్స్, క్రీడా మైదానాలు, ప్రత్యేకించి మహిళలకు పార్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఎక్కడా రాజీ పడకుండా ముందుకు వెళుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అభివృద్ధికే పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు కామనీ నర్సింహారెడ్డి, ఇండిస్ వన్‌సిటి రెడ్డి సంఘం ప్రతినిదులు నారాయణ రెడ్డి, రాజిరెడ్డి, తిమ్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైగర్ నరేంద్ర ఆల్విన్‌కాలనీ వ్యవస్థాపకుడు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ వ్యవస్థాపకుడు టైగర్ ఆలె నరేంద్ర వర్ధంతి కార్యక్రమం ఆలె నరేంద్ర సేవ సమితి ప్రధాన కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీలోని జలకన్య హోటల్ వద్ద పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామరాజు, నాయకులు రామిరెడ్డి, సీహెచ్ రాజు, కుమార్ చారి, పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పురస్కారాలు, కవి సమ్మేళనం

భాగ్యనగర్‌కాలనీ: విశ్వభారతి మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు, రాష్ట్రస్థాయి కవి సమ్మేళనాన్ని హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్ట సొసైటీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కవులను ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. కవిత్వ లక్షణమైన పదాల్లో పొదుపు జీవితానికే వర్తించాలని ప్రముఖ ట్యాగ్‌లైన్ కింగ్ ఆలపాటి అన్నారు. కవులు తమ రచనలు ఉపయోగించే పదాల విషయంలో పొదుపు పాటించినట్లే జీవితంలో పొదుపు అలవర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమను తాము సమీక్షించుకుంటూ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. డా. రాధాకుసుమ ఆధ్వర్యంలో కవి సమ్మేళన జరిగింది.

హైదర్‌నగర్ మసీదులో రంజాన్ తోఫా



తోఫాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: మైనార్టీల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని హైదర్‌నగర్ మసీదులో రంజాన్ తోఫాను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నక్క శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, ఖదీర్, సత్తార్‌యాసిన్, సయ్యద్ మున్నీర్ ఖాన్, హమీద్ షాబుద్దీన్, షరీఫ్, సద్దాం, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌నగర్, పీజేఆర్ నగర్‌లో..

ఆల్విన్‌కాలనీ: ఎన్‌టీఆర్‌నగర్, పీజేఆర్ నగర్‌లోని మసీదుల్లో ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాస్ ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సమ్మారెడ్డి, నాయకులు దొడ్ల రామకృష్ణ గౌడ్, జిల్లా గణేష్, కాశీనాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఐడీపీఎల్ ఆధీనంలోని భూమిని ఇస్తే.. పేదలకు డబుల్ ఇళ్లు నిర్మించి ఇస్తా

- ◆ కేంద్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సవాల్
- ◆ బాలానగర్ డివిజన్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం
- ◆ భారీగా పాల్గొన్న నాయకులు, ప్రజాప్రతినిధులు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు భూమి లేదని కేంద్ర ప్రభుత్వానికి నిరుపేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఐడీపీఎల్ ఆధీనంలో ఉన్న భూమిని కేటాయిస్తే అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి అందజేసే బాధ్యతను తాను తీసుకుంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరారు. బాలానగర్ డివిజన్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం ఫతేనగర్ డివిజన్‌లో తెలంగాణ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో నియోజకవర్గంలో 15వేల మందికి లబ్ధి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఈ స్థాయిలో ఉంది అంటే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరుతున్నాయంటే.. దేవుడి లాంటి కార్యకర్తలున్నారని తెలిపారు. కార్యకర్తలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చాక ఏ విధంగా ఉన్నాయో, ఇది వరకు ఏ విధంగా ఉన్నాయో ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమైందన్నారు.

◆ దశాబ్దాలుగా కాని పనులు నేడు ఎంతో ధైర్యంగా ముందడుగు వేస్తూ పూర్తి చేసుకున్నామని అన్నారు. బాలానగర్‌లో 60 ఏళ్లుగా కాని దిల్‌ఖుష్ నగర్ రోడ్లు, ఇందిరాగాంధీ వాసులకు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచటం వంటి అభివృద్ధి కార్యక్రమాలే ఉదాహరణ అని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే దాదాపు 15 వేల మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిపొందారన్నారు. ఆసరా ఫించన్లతో వృద్ధులకు వికలాంగులకు, ఒంటరి మహిళలకు అండగా ఉండటం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నామని అన్నారు.

ఒక రైలును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు...

◆ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎంతో క్రమశిక్షణతో కార్యకర్తలను పార్టీని నడపడం నిజంగా అద్భుతమైన విషయమని అన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచే కార్యాలయంలో ఉంటూ ఎవరు వచ్చినా వారి సమస్యను పరిష్కరించే గొప్ప నాయకుడన్నారు. ఇదే విషయం ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తనతో ఎప్పుడూ చెబుతుంటారని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వం సహకరించకున్నా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని తెలిపారు.

◆ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు కేటాయించే విషయంలో వివక్ష చూపడం నిజంగా దురదృష్టకరమన్నారు. ఒక రైలును ఎన్నిసార్లు ప్రారంభిస్తారని మనం పుట్టక ముందు నుంచే సికింద్రాబాద్ నుంచి తిరుపతికి రైలు ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా కూడా నీటి ప్రాజెక్టులు సంక్షేమ కార్యక్రమాలు ఆగవని నిరుపేదల పక్షాన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడు అండగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా వంద మంది బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, మహేశ్వరి శ్రీహరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

భాగ్యనగర్‌కాలనీ: భాగ్యనగర్‌కాలనీలోని సెంట్రల్ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఆదివారం రెవరెండ్ డాక్టర్ విప్పర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీసస్ సిలువపై మరణించి తిరిగి విజయుడై లేవడం ద్వారా సర్వమానవాళికి ముక్తి మార్గం ఏర్పాటయిందని తెలిపారు. విధాత యేసుక్రీస్తు ప్రభుత్వ సిలువపై సర్వ మానవ పాపపరిహార్థం ప్రాణత్యాగం చేసిన రోజు గుడ్ ఫ్రైడేగా జరుపుకొని పునరుత్థానుడైన రోజును ఈస్టర్‌గా జరుపుకుంటామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా తల్లి నిర్మలమ్మ ప్రత్యేక సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీసీ సంఘం సభ్యులు సతీష్ మంద్రు, రత్నమయ్య, ప్రసాద్, మార్త పురుషోత్తం, మేరీ ఎలిజబెత్, ఆర్థర్, పౌలిన ఎడిత్, జాలీ సామ్, జిన్న సామ్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట: మూసాపేట డివిజన్ జనతానగర్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలో ఆదివారం మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు జిల్లా గోపాల్, నర్సింహ, రవిసింగ్, అరుణ్, జైరాజ్, ఆశీర్వాదం,రమేష్, రవీందర్, అంబ్రోస్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న రెవరెండ్ డాక్టర్ విప్పర్తి, మహిళలు



జెరూసలేం చర్చిలో దొడ్ల రామకృష్ణగౌడ్‌ను సన్మానిస్తున్న పాస్టర్ రాజు



జనతానగర్‌లో జరిగిన ఈస్టర్‌లో తూము శ్రావణ్‌కుమార్